# తిక్కన 'సుదేష్ణ'

శ్రీ పుట్టపర్తి నారాయణాచారిగారు

(గతసంచిక తరువాయి)

కీచకుఁడొకనాఁడు త్రొక్కివచ్చినాఁడు. తనివిదీర త్రొక్కించుకొన్నదా గేస్తురాలు. తమ్ముని గుణములు చక్కఁగా నెఱుఁగును. వానికి పాపభయములేదు. విరాటునికీతని దండించు బలములేదు. ఇకపీఁడా-మదగర్వితుఁడు, అపారబలుఁడు. పాప-పాపపాపమటులందుల నడుమ సవసవలు బొడమినపుడు తానే ముందుఁబడి సవరించుచు నిద్దరి యభిమానమునకును బాత్రురాలై యుండినది. వాఁడు సుదేష్ణ ప్రేమకు లొంగినాఁడు. ఉన్నంతవరకు వాని కీమెపైననే 'కొంత భయభక్తులు.' వాఁడిపు డరుదెంచుట సుదేష్ణకు గొప్ప యసమాధానము. అందులనే "కతిపయ దినంబులు గొఱంతగా నేఁడు కాలంబు" వాని నిచటికి రానివ్వకనే గడపినది. నేఁడు చుక్కఁదెగినవసువున హఠాత్తుగాఁ జనుదెంచినాఁడు. ఇంతకుమునుపే సైరంధ్రి వీనికంటఁబడినది. సుదేష్ణ "అనంగశరదళిత హృదయుఁడై"నాఁడని నిర్ణయించినది. సుదేష్ణ ధర్మశీలయే, కాని స్వభావమును ధిక్కరించి-ఆత్మను వశీకరించి-ధర్మమును నిర్వహించు ధీరురాలుగాదు. వాఁడు "అనంగుపట్టియాఁడెడు జంత్ర"మైనాఁడు. తాను వేగిరపడి మందలించఁదగునా! ఇట్టి?, తన చెవికంట వలసివేనా? తానిందుఁ బ్రవేశించిన నిదివర కున్న గౌరవమునకు జలాంజలియేగదా? పోనీ మందలించుననుకొందము. వాఁడు తిరుఁగఁబడినచో తెరవు? ఊరకుండవలసినదేగదా! అపుడు తనగతి నిష్ఠురము గాదా! అయిన నిపుడు గావింపఁదలఁచిన దేది? సుదేష్ణ దలచినదిది.

"చూచియు చూడనట్లు నా పెద్దతనమును గాపాడుకొందును. అంతిపురమున మా యందరినడుమనున్న సైరంధ్రిని వాఁడెట్లు దాకఁగలఁడు? అతనికిని అక్కఱయెఱిఁగిన దండించునేమోయను జంకుండఁగలదుగదా! అది యసంభవము, ఇంతకు గడువు ముక్కాలు మువ్వీసము గడచినది. ఒకవేళ కీచకుఁడు యోచించి యోచించి తొడరులోపల నీయింతయుఁ దీరకపోవునా! తరువాత సైరంధ్రిని వదలించిన తన మర్యాదయు అసత్యమును అంటనేరవుగదా! అది సముచితము—" కాని యామెతలఁ పన్యథా నడచినది. పాపము.

మన్మథవశుఁడగు వాఁ డాఁగలేదు. జంక లేదు. కాముఁడు జంకనివ్వలేదు వానిని. నేరుగా సమీపించినాఁడు. వాని ముఖవైఖరినిఁ జూచియే గ్రహించినది. అసహ్యము తీండ్రించినది. అయినఁ జేయునదేమి! అన్నిటికిసిమించి తమ్ముఁడు ఇల్లుద్రొక్కినాఁడు. "ప్రియముచూడ్కి ముసుఁగువడ" మరి యాదఁ జెల్లించినదట. వాఁ డూరకుండునా! మదనోన్మాదియగు వానికి సుదేష్ణ యభిప్రాయము గ్రహించు తీరికయెక్కడిది? "వేగ

పడి" సైరంధ్రి విషయము ప్రస్తావించి నాఁడు. మేధశ్శాలినియగు సుదేష్ణ యంత లోననే డిల్లపడునా? వాని మాటలు విని పించుకొనలేదు. "గీటునఁబుచ్చి యొండు పలుకులు" జరిపినది. అంతటిలో నా విషయము మరలఁ బ్రస్తావించఁ దనుకొన్నది. వాఁడు నిట్టూర్చి వెడలినాఁడు. పోయిన వాఁడురాక మానినాఁడా! పీడ ఘరల యంటినది! సైరంధ్రియెడ నెంత యనుచితముగఁ బ్రవర్తింపవచ్చునో యంత వరకు నెఱపిమరల యక్కసాలఁ బడినాఁడు. మదనావేశము సంపూర్తిగాఁ దలకెక్కినది. అతని "వేగిరపాటు" గమనించి శిరఃకంపంబు సేసినది. ముందుండిన యాయింత జంకును విడచినాఁడు. వాఁడు వలదన్న వినువాఁడుగాఁ గానరాలేదు. దైవమాయని యాకాశముఁ జూచి నొచ్చుకొన్నదా సంసారిణి. ధర్మము హెచ్చరించినది. సైరంధ్రి గతియేమి? వాని కామాగ్ని కాహుతి గావలసినదేనా! గుండె దిటవుజేసుకొని యెటులైనను చెప్పి చూతమని ప్రారంభించినది. తొలుత లేని నవ్వు దెచ్చుకొని సాభిప్రాయముగా మందలించినది. "పిచ్చివాఁడా! అప్సరసలవంటి అతివలున్నారే! సీరసాకారయగు సైరంధ్రి యేలరా!" యని సరసముగ మందలించినది. వాని మనసునకు వైభవము సుఖము సరిగా హత్తుటకై సాంగోపాంగముగా వివరించినది. ఆ పద్యమెంత మృదులముగానున్నదో చూతము—

సీ. లలితంబులగు మట్టియలచప్పుడింపార
నంచకై వడి నడనల్లవచ్చి
యెడమేని నెత్తావి సుడియంగ బయ్యెద
సగముదూలించి పై మగుడఁదిగిచి
సోలెడు నెలదీగ లీలఁ గ్రాలుచు వింత
చెలువంబుదలకొనఁ జేరినిలిచి
తెలిగన్నుఁగవను నెచ్చెలిరైన లేత న
నవ్వొలయంగ సరసంపుఁ బలుకు పలికి
గీ. మెఱయు చెయ్వులరాగంబు మెయికొనంగ
నెడద సొగయించుమాటల నెలమి మిగుల
నిన్ను ననురక్తిఁ గొలుచు నన్నెలతలుండ
నీరసాకార సైరంధ్రి గోరఁదగునె.

కీచకుఁడు మాత్రము మాటలు రాని వాఁడా! వాఁడు గొప్ప నాగరికుఁడు. మన తిక్కన సృష్టించిన కీచకుఁడు సర్వవిధముల గడుసరి. వాఁడు "నా కొలువువారు కారన్నాకేశుని గొలుచు సంగనలలోనైనఁ అట్టి చెలువముండఁదని" షరత్తుగట్టినాఁడు. అనుభవవాదము పడిపోయినది. అయినను చూతమని ధర్మమునుఁ బ్రస్తావించినది. ఈదారి వానికి వచ్చునను నమ్మకమామెకు లేదు. ఆ ధర్మమునుఁ జెప్పుటలో నామె పడ్డపాటులఁజూచిన తన వాదముపై నామెకెంత నమ్మకమున్నదియుఁ దెలిసివచ్చును. ప్రభుసమ్మతమగు నియమమునకుఁ గట్టుబడఁడని యెరిఁగినదగుటచే "సుఖమను" మచ్చు జల్లి చల్లగాఁ జిలుకరించుచున్నది. పూర్వపరిపాటియెత్తి చెప్పినది. అధర్మమునందు సుఖములేదురా నాయనా! యని గడ్డముఁ బట్టి బ్రతిమాలుకొన్నది. వానికి కథలు చెవులకెక్కలేదు. ధర్మమునకు వెఱువఁడు.

అందున సుఖములేదనుమాట వాని కనుభవ దూరముగనున్నది. కడకుఁజేయునదిలేక భయపెట్టఁదివురుకొన్నది. ఇది యామె కడపటి యస్త్రము. దీనితోనైన దుర్వ్యాపారమునుండి మరలునేమోయని యాసించెను. కాని యాయుపాయమును మొక్కపోయినది. బలగర్వితుఁడగు వాఁడీమాటలు లెక్కసేయునా? అడియాసగాక. వాని యుత్తరమెంత తీవ్రముగ నున్నదో చూడుఁడు.

మ. వనితా! యే నొకపల్కు నల్కద జతు
ర్వారాశి మధ్యంబునన్
ఘనబాహా బలమొప్పనన్నెదురం
గా నెవ్వరున్ లేమి యె
వ్వనికిన్ దల్లమగాద దానిపతుల
న్వజ్రాహతిన్దూలు శై
లని కాయంబన మద్భుజాసమదలీ
లన్ గీటడంగించెదన్.

వాఁడు 'నావృద్ధిఁగోరు దానివైన నా పంపుసేయు' మనిపాదములకడఁ జాపుగాఁబడినాఁడు. అబలయగు సుదేష్ణ యెట్టి విషమస్థితిలోనున్నదో గమనింపుఁడు. తమ్ముఁడనుఁ బక్షపాతమొకటి. అయ్యో! గంధర్వులు దానిమగలే యనుభీతియొకటి. ధర్మలోపమే యను జంకుఁగొంత. సైరంధ్రిపై దయకొంత. వీఁడవివేకి యామెనేయను నసహ్యమొకటి. ఇవన్నియుఁగలిసి ఆమెకనులనుండి భావశబలితములగు బాష్పములు జాఱినవి. అట్టియెడ నామె దప్ప యెవరైన వాటిని "కనుగవ" లోమ్రింగికొనఁ గలరేమో యోచింపుఁడు!

సర్వవిధములఁ దమ్ముని మరలింపఁ జూచినది. శతోపాయములు నష్టమైనవి. కడకు స్త్రీ హృదయము గదా - సోదరఁ ప్రేమకు లొంగినది. కఠినమగు ధర్మ నిర్వహణమందరికిని సాధ్యమగునా! ఒకవేళ సుదేష్ణయందు కొంతదోషమే యున్నదనుకొందము. దానితోఁ దక్కినవెల్ల దుష్టములు గావలసినవేనా! అవకాశము లభించినపుడంతో యింతో ధర్మమునకై యత్నించు సుదేష్ణ శీలవతియు,మనస్వినియునని యొప్పుకొన్న దోషములేదు గదా! మనుష్య హృదయమునకే చాపల్యము వీఁడరానిది కాగా, స్త్రీకి వెన్నుఁదన్ని పుట్టిన సహోదరుని యందాపాటి ప్రేమయుండుటలోన లోకసామాన్యతయున్నదా! ధర్మైక నిష్ఠత్వము లేకపోవుగాక.

రెండురీతుల యోచించుకొన్నది సుదేష్ణ. మన్మథశరములనైనను - గంధర్వులతోనైనను-చావు నిజము. అయిన అధర్మాచరణమునకేల ప్రయత్నించుట? నిజమే. కాని అందుననేఁ జిన్నపొరపాటు. ఇపుడు వీనిని తిరస్కరించినచో యెదిరించి నిలుచును. అపుడా యింతటి జంకునుఁదొలఁగును. అపుడు విరాటుగతియు తనగతియునేమి! కీచకుని కోపము సద్యఃఫలముగదా! సైరంధ్రిని కామించెబో-గంధర్వులు వీని నెదిరించ గలరా! ఆనాఁటి బలవంతులలోఁ గీచకుఁడు మేటి. వానిఁజయింప వారికిమాత్రము సాధ్యమగునా! ఒకవేళ తానిపుడు నిరోధించిన వాఁడు వినక సైరంధ్రిపైఁబడు ననుకొం

దము. అశక్తులగు గంధర్వులూరకున్న తొలుత నిరోధించిన సుదేష్ణపై వాని కలుక నిలువదా! అన్నిటికిపైగా సోదరస్నేహము ములుసూపుచున్నదే దానికేమి బదులియ్య గలదు రాణి? ఈవిషమ విచారములలోఁ దగిలి కడకు వాని నూరార్చిపంపివేసినది. ఉపాయమునుఁగూడ నిర్ణయించినది. ఇక తరువాతి ఘట్టమారంభమైనది. సుదేష్ణ సైరంధ్రిని రావించినది.

క॥ ఒదవెడుతృష పెల్లిదమున
వదనము వఱువట్లువాఁడె వానితరాజ
న్మదిరారస మానఁగ నా
హృదయంబున వేడ్క యొసక మెసఁగెడు ధరుణీ.

క॥ కీచకునియింట నెప్పుడు
వాచవియగు బహువిధములవారుణి గలుగుణ్
వేచని ఇచటికిఁగొనిర
మ్మా! చూతముగాని నీగమన వేగంబుణ్.

అని పలికినది. అందుపై సైరంధ్రిదానచటి కిఁబోరామియు, అనుచితములగు పనుల కుఁదన చాలమియు నెఱిఁగించినది. అనుటయు సుదేష్ణమనసు కళుకుమన్నది. ధర్మమునుఁ దప్పుచున్నానే యని శంకించినది. "అను చితమునకు శంకించియును లతాంగి తమ్ముని వలవంతఁదలఁచి దురపిల్లినది. సైరంధ్రి పలుకులకు సముచితమగు విధమున మేలంపు మాటల బదులొసఁగినది. "అది లాతియిల్లె" యని బంధుత్వమునుఁ గూర్చినది. "నిన్న చటివారు హృదయముల నెఱుఁగనే యెఱుఁగరా" యని విడ్డూరపు మాటలాఁడినది. "నిన్నుఁగన్నదిమొదలు నేను వారితో నీ చరిత్ర ప్రసంగాంతరములలో వాకొను చుందు"నని తన మెప్పును ప్రకటించి పొగడి నది. "ఇది సెయ్యము తీయమా"యని నిష్ఠు రము లాఁడినది. చాలఁక సఖీ! యని పలు విధములఁ బ్రార్థించినదట.

సైరంధ్రి సుదేష్ణనుగురించి "అత్యంత కలుషాత్మ" యని యభిప్రాయ మొసఁగినది. సైరంధ్రి "కలుషాత్మ" యని సుదేష్ణను నిందించుటలో వింతలేదు సరిగదా న్యాయము గూడదు.

కాని కథాభాగమునకుఁదప్పి తీరమున నిలిచిచూచు మనకు సుదేష్ణ యెట్టిది? ఆమె శీలవతి మరియాద నెఱిఁగినమగువ. అనుభవశీల! ధర్మానువర్తిని! కాని తమ్ముని యవస్థసూచి యోర్చుకొనలేక పోయినది. అన్నియు తదనుకూలములగు విషమ పరిస్థితులే యేర్పడినది. ఆ విషమపరీక్షలో యోడిపోయినది. సుదేష్ణవంటి సామాన్య వనిత నిష్ఠురమగు ధర్మపరీక్షకు జంకినదన్న నాశ్చర్యమేమి గలదు? మనతోటి సుదేష్ణను మనము క్షమింపకున్న పాపమనువారెవరుం దురు.